రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో 'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com
ప్రకాశం జిల్లా వార్తలు





# ప్రతి మహిళా.. ఆర్థిక శక్తిగా ఎదగాలి

- ☀ పొదుపు గ్రూపులు.. బలోపేతం కావాలి
- ☀ ఎస్‌హెచ్‌సీలకు శ్రీకారం చుట్టింది చంద్రబాబు
- ☀ మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం
- ☀ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి
- ☀ కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
- ☀ వీవోఏలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

కందుకూరు, ఏప్రిల్17 (జాతీయ వార్త): జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో... కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల వివోఏలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని 179 మంది వీవోఏలకు ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో పొదుపు గ్రూపులకు చంద్రబాబు నాయుడు  శ్రీకారం చుట్టారని, అప్పటినుంచి మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా రుణాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఒక్కొక్క గ్రూపునకు గరిష్టంగా 20 లక్షలు వరకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయన్నారు. గతంలో రుణాలు తీసుకున్న మహిళలు... పాడిపరిశ్రమ కోసం వాటిని ఉపయోగించుకునే వారని, ప్రస్తుతం వ్యాపారాల మీద దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు సంపాదించుకుంటున్నారని తెలిపారు. వీవోఏలు ప్రతి మహిళను పొదుపు గ్రూపుల్లో చేర్చే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వారిలో చైతన్యాన్ని కలిగించాలన్నారు.  ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కులు వాటాలు కల్పించారని ఎమ్మెల్యే గుర్తుచేస్తూ... చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక డ్వాక్రా గ్రూపుల ఏర్పాటుతో మహిళలకు అండగా నిలిచారని అన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పించారని చెప్పారు. ప్రస్తుతం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టబోతున్నారన్నారు. పొదుపు గ్రూపులు మరింతగా బలోపేతం కావాలని, ప్రతి మహిళ ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. రోజురోజుకు మారుతున్న టెక్నాలజీపై వీవోఏలు అవగాహన పెంచుకొని విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, తద్వారా నియోజకవర్గ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.  ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఇంచార్జ్ ఎంపీడీవో ఓబులేసు, కందుకూరు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మేడికొండ కెజియా, ఉలవపాడు అధ్యక్షురాలు సుగుణమ్మ, ఏపిఎంలు సింహాద్రిరావు, సురేష్, కృష్ణయ్య, చినబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





## అన్న క్యాంటీన్ పరిశీలన

### ☀ పేదలతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి భోజనం



కందుకూరు, ఏప్రిల్17 (జాతీయ వార్త): కందుకూరు పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించారు. మెనూ ప్రకారం ఆహారం, పదార్థాల నాణ్యత, క్యాంటీన్‌లో పరిశుభ్రతను పరిశీలించారు. పదార్థాలు రుచిగా ఉన్నాయా లేదా, సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందంటూ ఆరా తీశారు. స్థానిక నేతలు, పేదలతో కలిసి క్యాంటీన్‌లోనే ఎమ్మెల్యే భోజనం చేశారు. తక్కువ ధరకే పేదల కడుపు నింపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనతో అన్న క్యాంటీన్లు ఏర్పాటు కాగా... ప్రజలు నిండు మనసుతో ఆశీర్వ దిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే  వెంట పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పలువురు నాయకులు ఉన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## ప్రకాశం



### పేకాట శిబిరంపై దాడి

**కందుకూరు, ఏప్రిల్ 17 (జాతీయ వార్త):** కందుకూరు పట్టణ పరిధిలో కీసరగుంట కాలనీ యానాది సంఘం ఏరియాలో పొగాకు గోడౌన్ వద్ద శుక్రవారం పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 9330 పట్టుకున్నట్లు ఎస్సై శివ నాగరాజు తెలిపారు. అందిన సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి వారి వద్ద నుంచి 9 సెల్ ఫోన్లు, ఐదు బైకులు సీజ్ చేసినట్లు చెప్పారు

### సింగరాయకొండ ఎస్ఐ బదిలీ

**సింగరాయకొండ, ఏప్రిల్ 17 (జాతీయ వార్త):** సింగరాయకొండ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బండ్లమూడి మహేంద్రకి బదిలీ అయింది. సింగరాయకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో టౌన్ పోలీస్ విధానం, రోల్ కాల్, విజిబుల్ పోలీస్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డుపై ఆక్రమణల తొలగింపు, గంజాయి మాదక ద్రవ్యాల చెలామణి వల్ల కలిగే అనర్థాలపై యువతలో అవగాహన, హెల్మెట్ ప్రాధాన్యత, వాహన దారులకు రోడ్డు భద్రతపై



అవగాహన, బాలికలు, విద్యార్థినుల పై జరిగే లైంగిక వేధింపులు, పోక్సో కేసులపై అవగాహన కల్పించడం వంటి చర్యలను ఎస్ఐ మహేంద్ర చేపట్టారు. అలాగే ఆయన దురుసుతీరుపై పలు విమర్శలను కూడబెట్టుకున్నారు. సింగరాయకొండ నుండి బదిలీ కావడంతో బండ్లమూడి మహేంద్ర శుక్రవారం సాయింత్రం విధుల నుండి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా సింగరాయకొండ స్టేషన్ పోలీస్ సిబ్బంది, స్థానిక అధికార పార్టీ నాయకులు, వ్యాపార వాణిజ్య వర్గాల ప్రజలు, జర్నలిస్టులు వీడ్కోలు పలికి అభినందనలు తెలిపారు.

### ఇంచార్జ్ తహాశీల్దార్‌ను కలిసిన పెగడ



**వలేటివారిపాలెం, ఏప్రిల్ 17 (జాతీయ వార్త):** ఇంచార్జ్ తహశీల్దార్‌ను అంకబోపాలపురం, రామచంద్రపురం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సీనియర్ అడ్వకేట్ పెగడ శ్రీనివాసులు, పెగడ మోహన్ కుమార్, సిరిగిరి కొండారెడ్డి, సన్నపురెడ్డి నాగిరెడ్డి, బిరుదుల రవీంద్ర కుమార్ ఉన్నారు.

### మొగిలిచర్లలో పోషణ పక్వాడ

**లింగసముద్రం, ఏప్రిల్ 17 (జాతీయ వార్త):** మొగిలిచెర్ల అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం 'పోషణ పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ రాధాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఇంట్లో తయారుచేసిన పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. గర్భిణీలు పాలిచ్చే తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమయానికి పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. పిల్లల పెరుగుదలకు తల్లుల ఆహారం ఎంతో ప్రభావం చూపుతుందని, తల్లులు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. గ్రామస్తులకు పోషణపై అవగాహన పెంచేలా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి.మార్తమ్మ, సులోచన, ప్రసన్న, ఓబులమ్మతో పాటు గ్రామ మహిళలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



## గుండ్ల సముద్రంలో..

* ప్రజలు, విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి
* ఓపికగా గ్రామస్థుల సమస్యలు విన్న రాజాబాబు
* అక్కడికక్కడే కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం
* గ్రామాభివృద్ధి, పారిశుధ్య నిర్వహణలో గ్రామస్థుల పాత్ర కీలకమన్న కలెక్టర్

# కలెక్టర్ పల్లెనిద్ర

**మర్రిపూడి, ఏప్రిల్ 17 (జాతీయ వార్త):** ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. శుక్రవారం ఆయన మర్రిపూడి మండలంలోని గుండ్ల సముద్రం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు ప్రస్తావించిన సమస్యలను ఓపికతో విని వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులతోనూ కలెక్టర్ ప్రత్యేకంగా ముచ్చటించారు. గ్రామ అభివృద్ధిలో, ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణలో ప్రజలు కూడా తమ వంతు బాధ్యత నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.



**గ్రామ సమస్యలు ఇవీ...**

మండల పరిధిలో రెండు ప్రధాన చెరువులు ఉన్నాయి. ఈ రెండు చెరువులకు పూర్తి స్థాయిలో నీటిని నింపినట్లయితే మండల పరిధిలోని అన్నీ గ్రామాలకు తాగు, సాగునీటికి సమస్య ఉండదు. అలాగే ఈ గ్రామంలో సైడు కాలువలను నిర్మించాల్సిన అవసరం ఉంది. ఈ సంవత్సరం కంది పంట దిగుబడి బాగా వచ్చింది. గోతాల కొరతతో కొనుగోలు కేంద్రంలో కందులు కొనుగోలు చేయడం ఆలస్యం అవుతోంది. గుండ్లసముద్రం గ్రామంలో పశువుల మేత పోరంబోకు భూములు చాలా వరకు ఆక్రమణకు గురికావడం జరిగింది. ఆ భూములను సంరక్షించి పేద ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి. ఎస్ టి రాజుపాలెం లో సుమారు 40 కుటుంబాల ఎస్ టి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాము. కొద్ది పాటి వర్షాలు కురిసినా ఈ ప్రాంతం మునిగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మా రోడ్డు ను మెరక చేసి రాక పోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి. పెళ్లయి 12 సంవత్సరాలు అయినా నావివరాలు హౌస్ మాపింగ్‌లో లేదని అరుణ అనే మహిళ కలెక్టర్ వద్ద ఏకరువు పెట్టింది. నా వివరాలు హౌస్ మ్యాపింగ్లో మా తండ్రి వివరాలతో మ్యాపింగ్ అయినందున నా కుటుంబానికి తల్లికి వందనం వంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదని వాపోయింది. మా గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలి. గ్రామంలో నీటి సరఫరా ఎప్పుడైనా ఆగినప్పుడు సంబంధిత ట్యాంకు నుండి నీటిని తెచ్చుకునేలా అవసరమైన సౌకర్యం కల్పించాలి. గ్రామంలో స్మశాన వాటికకు వెళ్ళే దారిని సిమెంటు రోడ్డు వేయాలి. మా గ్రామంలో కొంత భూమి 22ఏ లో కలిసింది. 22ఏ నుండి ఆ భూమిని తొలగించాలి. అవసరాలకు అమ్ముకోలేక పోవుచున్నాము. గుండ్ల సముద్రం మాదిగ పల్లెకు స్మశాన వాటికకు భూమి కేటాయించాలని గ్రామస్థులు కలెక్టర్ వద్ద విన్నవించుకున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ శ్రీ.డి.హిమవంశీ, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందుగా గ్రామంలో ఆయన పర్యటించి అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఇటీవల నిర్మించిన అంతర్గత సిమెంటు రోడ్డు నాణ్యత పరీక్ష ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అభివృద్ధి పనులలో నాణ్యత లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. మర్రిపూడి గ్రామంలో రీ సర్వే జరుగుతున్న తీరును కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. యానం నరసింహ, యానం గురవయ్య, యానం నాగయ్య భూములను అధికారులు రీసర్వే చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. గ్రౌండ్ ట్రూతింగ్ సమయంలోనే ఈ- కేవైసీ చేయాలని, రైతుల సమక్షంలోనే ఈ మొత్తం ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్‌స్పష్టం చేశారు.






# పెద్దపావనిలో 'ఆపరేషన్ వజ్రా ప్రహార్'

* గ్రామంలో పోలీసుల విస్తృత తనిఖీలు
* గంజాయి, మాదక ద్రవ్యాల నిల్వలపై సోదా
* 44 మోటారు సైకిళ్లు స్వాధీనం
* డ్రగ్స్ వద్దు బ్రో పేరిట ర్యాలీ




**లింగసముద్రం, ఏప్రిల్ 17 (జాతీయ వార్త):** పెద్ద పవని గ్రామం, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం 'ఆపరేషన్ వజ్రా ప్రహార్'లో భాగంగా పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, కందుకూరు సీఐ అన్వర్ బాషా, లింగసముద్రం ఎస్సై రాంబాబు, వివి పాలెం ఎస్సై మరిది నాయుడు, కందుకూరు టౌన్ ఎస్సై నాగరాజు, కందుకూరు రూరల్ ఎస్సై బాలకృష్ణతో పాటు మొత్తం 42 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ పరికరాలతో అనుమానితులను తనిఖీ చేయడంతో పాటు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇళ్లు, దుకాణాలు, గంజాయి కేసుల్లోని పాత ముద్దాయిల నివాసాలు తదితర ప్రదేశాలను సోదాలు చేశారు. తనిఖీలలో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 44 మోటార్‌సైకిళ్లు, మూడు ఆటోలు, ఒక కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాహన యజమానులకు చలానాలు విధించారు. అదే సమయంలో రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. యువత, వ్యాపారులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'గంజాయిని పారద్రోలుదాం – డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం' అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కందుకూరు డీఎస్పీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి, రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546